నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
శనివారం | డిసెంబర్ 14, 2024 | www.navatelangana.com

ప్రాథమిక పాఠశాలను సందర్శించిన డీఈఓ

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని ఎల్లారం గ్రామ ప్రాథమిక పాఠశాలను మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభ పాఠశాలను పరిశీలించారు. వారితో తెలుగు, ఇంగ్లీష్, చదివించారు. ఇంగ్లీష్ చదవడంలో వెనుకబడి ఉండటాన్ని గుర్తించి, పిల్లలు ఇంగ్లీష్ కూడా చదివేటట్లు శ్రద్ధ చూపలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో డ్రాప్ అవుట్ శాతం తగ్గించాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, పాఠశాల విద్యార్థుల అభివద్ధికి కషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి హెలెన్ డారతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి వినతుల వెల్లువ

నవతెలంగాణ-ముధోల్

ముధోల్‌కు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు శుక్రవారం పలువురు వినతిపత్రాలు అందజేశారు. మంత్రి గురుకుల పాఠశాలలో పెంచిన మెనూను శుక్రవారం ప్రారంభించాల్సి ఉండగా సమయభావంతో రద్దు అయింది. బాసర పర్యటన ముగించుకొని నిర్మల్‌కు వెళ్తుండగా గురుకుల పాఠశాల ఎదుట ప్రజలు గుమిగూడి ఉండటంతో మంత్రి తన వాహనాన్ని కొంత సేపు ఆపారు. దీంతో జర్నలిస్టులు, పంచాయతీ పారిశుధ్య కార్మికులు, అంగన్వాడి కార్యకర్తలతో పాటు పలువురు మంత్రికి వినతి పత్రాలు అందజేశారు. తాము ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు. బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ మంత్రి రోడ్డుపై వినతి పత్రాలను స్వీకరించారు. పలువురు సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



సమగ్ర ఉద్యోగుల సమ్మె..!

- కేజీబీవీలు, భవిత కేంద్రాల్లో నిలిచిన బోధన
- విద్యాశాఖ కార్యకలాపాలకూ అవరోధాలు
- క్రమబద్ధీకరణ కోసం పోరాడుతున్న ఉద్యోగులు
- పరిష్కారమయ్యే వరకు విరమించబోమని స్పష్టం
- సీఎం రేవంత్ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్

ఏండ్లుగా వేధిస్తున్న సమస్యలను పరిష్కరించాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు మరోసారి సమ్మె బాట పట్టారు. విధులు బహిష్కరించి నిరసన చేపడుతున్నారు. ఫలితంగా నిరుపేద విద్యార్థులు చదువుకునే కస్తూర్బాగాంధీ విద్యాలయాలు, మానసిక, శారీరక వికలాంగత్వం కలిగిన పిల్లలు చదువుకునే భవిత కేంద్రాల్లో బోధన పూర్తిగా నిలిచిపోయింది. వీటితో పాటు విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులందరూ పోరుబాట పట్టడంతో కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సర్వీసు క్రమబద్ధీకరణ అంశం పరిష్కరించే వరకు అవిశ్రాంత పోరాటం సాగిస్తామని ఉద్యోగులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వాలు హామీనిస్తున్నా కార్యరూపం మాత్రం దాల్చడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిష్కారమయ్యే వరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేస్తున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా పేద విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూ.. భవిష్యత్తు పౌరులుగా తీర్చిదిద్దుతూ.. వారిలో మానసిక పరిపక్వత తీసుకొస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నాయి. గత 20ఏండ్లుగా ఉపాధ్యాయులుగా.. విద్యావ్యవస్థ అభివృద్ధి కోసం వివిధ రకాల విధులు నిర్వర్తిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు సర్వీసు క్రమబద్ధీకరణ కోసం ఏండ్లుగా పోరాడుతున్నారు. సమగ్ర శిక్షా అభియాన్ పరిధిలో కేజీబీవీ,యూఆర్ఎస్ బోధన, బోధనేతర సిబ్బందితో పాటు డీపీఓలు, ఎంఐఎస్ కోర్డినేటర్లు ఐఈఆర్పీలు, సీసీఓలు, పీటీఐ, మెసేంజర్లు పనిచేస్తున్నారు. వీరంతా ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 600మంది వరకు ఉండగా ఉమ్మడి జిల్లాలో 2400మంది వరకు ఉన్నారు. గత 15 నుంచి 20ఏండ్ల నుంచి సమగ్ర శిక్షా ఉద్యోగులుగా విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్నారు. రాష్ట్రంలో 19,600మందికి పైగా ఉద్యోగులు పాఠశాల విద్యాభివృద్ధి కోసం కృషిచేస్తున్నారు. అరకొర వేతనాలతో పనిచేయడమే కాకుండా సర్వీసు రెగ్యూలర్ కాకపోవడంతో ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనాలు దక్కడం లేదు. ఇందులో చాలా మంది సర్వీసు 15 నుంచి 20వరకు వరకు ఉండటం.. ప్రభుత్వం ఉద్యోగ క్రమబద్ధీకరణలో తాత్సారం చేయడం మూలంగా ఆందోళన చెందుతున్నారు. పూర్తిగా పాఠశాలలో బోధనతో పాటు విద్యాశాఖ కార్యకలాపాలకు అంకితమై పనిచేస్తుండటంతో ప్రభుత్వ ఉద్యోగాలకు నిర్వహించే పోటీ పరీక్షల్లో కూడా నెగ్గలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి తమ సర్వీసు క్రమబద్ధీకరణకు హామీనిచ్చారని ..ఆయన నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నిలిచిన విద్యా బోధన..!

ఆదిలాబాద్ జిల్లాలో 18 కస్తూర్బాగాంధీ విద్యాలయాలు ఉండగా వీటి పరిధిలో సుమారు 5400మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో చాలా మంది తల్లిదండ్రులు లేని వారితో పాటు నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన వారే ఉంటారు. ఇలాంటి పిల్లలకు వసతితో కూడిన నాణ్యమైన విద్యనందించేందుకు కేంద్రం కేజీబీవీలను ఏర్పాటుచేసి ఉపాధ్యాయులను నియమించింది. కానీ ప్రస్తుతం ఉపాధ్యాయులు సమ్మెలో ఉండటంతో తరగతుల నిర్వహణ పూర్తిగా నిలిచిపోయింది. పదో తరగతి పరీక్షలు దగ్గరపడుతున్న ఈ తరుణంలో బోధకులు లేక పాఠాలు కొనసాగకపోవడంతో ఫలితాలపై ప్రభావం పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోపక్క భవిత కేంద్రాలకు వచ్చే విద్యార్థులు మానసిక, శారీరక వికలాంగత్వంతో బాధపడే ఉంటారు. ఇలాంటి వారికి ఫిజియోథెరపి చికిత్సలతో పాటు వారికి అర్థమయ్యే రీతిలో బోధన చేస్తూ వారిలో పరిపక్వత తీసుకొస్తున్న ఐఈఆర్పీలు సైతం సమ్మెలోనే ఉండటంతో భవిత కేంద్రాల్లో తరగతులు నిలిచిపోయాయి. వీరితో పాటు పీటీఐలు, డీపీఓలు, ఎంఐఎస్ కోర్డినేటర్లు, సీసీఓలు, మెసెంజర్లు సైతం విధులు బహిష్కరించి నిరసన చేపట్టడంతో విద్యార్థులకు పాఠాలతో పాటు విద్యాశాఖ కార్యకలాపాలకు సైతం ఆటంకం కలుగుతోంది. సర్వీసు క్రమబద్ధీకరణ చేయడంతో పాటు అప్పటి వరకు పేస్కేల్ ఇవ్వాలని, జీవిత బీమా రూ.10లక్షలు, రూ.10లక్షల ఆరోగ్య బీమా, పదవి విరమణ పొందిన వారికి రూ.25లక్షలు పీఐటీఐలను వొకేషనల్ టీచర్లుగా పేరు మార్చి రెగ్యూలర్ చేయాలని, రీ-ఎంగేజ్ విధానాన్ని తొలగించాలని డిమాండ్లు విధించారు. వీటిని పరిష్కరించే వరకు సమ్మె విరమించబోమని స్పష్టం చేస్తున్నారు.


ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన(ఫైల్)


తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఆందోళన(ఫైల్)

సర్వీసు క్రమబద్ధీకరణ చేపట్టాలి : మల్లిక, కేజీబీవీ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షురాలు



అనేక ఏండ్లుగా సమగ్ర శిక్షా అభియాన్ పరిధిలో పనిచేస్తున్నాం. బోధన, బోధనేతర సిబ్బంది అందరూ ఈ ఉద్యోగం మీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అరకొర వేతనాలు వస్తున్నా.. సర్వీసు క్రమబద్ధీకరణ అవుతుందనే ఆశతో పనిచేస్తున్నాం. కానీ ప్రభుత్వాలు తమ సమస్యను నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఫలితంగా విధులు బహిష్కరించి నిరసన తెలపాల్సి వచ్చింది. ఈ సమస్య మీద అనేక ఏండ్లుగా పోరాడుతున్నాం. ప్రస్తుత సీఎం సైతం ఎన్నికల సమయంలో హామీనిచ్చారు. ప్రభుత్వం వెంటనే తమ సర్వీసును క్రమబద్ధీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం. సర్కారు స్పందించే వరకు పోరాడుతూనే ఉంటాం.



సీఎం హామీని నిలబెట్టుకోవాలి : పడాల రవీందర్, టీఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం అధికార ప్రతినిధి

సమగ్ర ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ చేయకుండా గత ప్రభుత్వం మోసం చేసింది. గతంలో టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ సర్వీసును క్రమబద్ధీకరిస్తామని స్వయంగా హామీనిచ్చారు. అధికారంలోకి రాగానే నెరవేరుస్తామని చెప్పారు. కానీ ఏడాది గడిచినా ఇప్పటి వరకు చేయలేదు. గత 13ఏండ్లుగా పోరాడుతున్నాం. తాము అందరం కూడా బలహీనవర్గాల పిల్లలమే. ప్రభుత్వం తమ పట్ల నిర్లక్ష్యం చేయడం తగదు. సర్వీసు క్రమబద్ధీకరిస్తామని అసెంబ్లీ వేదికగా ప్రకటించాలి. అప్పటి వరకు సమ్మె విరమించేది లేదు.

లక్ష్యం కోసం కష్టపడి చదవాలి



నవతెలంగాణ-తలమడుగు

విద్యార్థులు లక్ష్య సాధనకు కష్టపడి చదవాలని రామగుండం డీఎస్పీ నర్సిములు అన్నారు. శుక్రవారం మండలంలోని ఖోడద్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లా సీనియర్ స్థాయి ఖోఖో మహిళ, పురుషుల ఎంపిక పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివితేనే ఉన్నత లక్ష్యాన్ని చేరుకుంటారన్నారు. గత ప్రస్తుత కాలానికి చాలా తేడా ఉందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితిలో కొంతమంది గూగుల్‌లో సెర్చ్ చేస్తూ చదువుకొని గ్రూపు-1 ఉద్యోగాలు కూడా సాధించిన వారున్నారని తెలిపారు. తన చిన్ననాటి కష్టాన్ని విద్యార్థులకు వివరించారు. నేటి తరంలో విద్యార్థులకు ఎంత నేర్చుకుంటే అంత విద్యతోపాటు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులతోపాటు యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచి మార్గంలో నడిచే సమాజానికి మహోన్నత వ్యక్తిగా నిలవాలన్నారు. అనంతరం క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, దేవదాస్, మాజీ సర్పంచ్ ఆనంద్, కిరణ్ కుమార్, శివకుమార్, క్రీడా ఉపాధ్యాయులు శ్రీధర్, పార్థసారధి, రాష్ట్రపాల్, ప్రభాకర్, లక్ష్మారెడ్డి, దేవిదాస్, దయానంద్, కృష్ణ పలువురు క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై మోహన్‌బాబు దాడి గర్హనీయం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

జర్నలిస్టులపై దాడి చేసిన సనీ నటుడు మోహన్‌బాబు వెంటనే బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. దాడిలో గాయపడ్డ జర్నలిస్టు ఆసుపత్రి ఖర్చులు భరించుకొని ఆదుకోవాలన్నారు. సినీ నటునిగా మీడియాతోనే ఎదిగిన బాబుమోహన్ మీడియాపైనే దాడి చేయడం అవమానకరమని తెలిపారు. కుటుంబ విషయాలను గొడవలుగా మార్చుకొని రోడ్డుపాలు చేసుకోవడం తన విజ్ఞతకే వదిలేస్తున్నామని, ఆందోళనగా మారిన గొడవ గురించి ప్రశ్నించిన మీడియా మైకు లాగి రిపోర్టర్లపై దాడి చేయడం అప్రజాస్వామికమన్నారు. తప్పు చేసి గాయపర్చి రిపోర్టర్లదే తప్పు అంటూ చెప్పడం సిగ్గుచేటన్నారు. తన ఇంటి లోపలికి ఆయన కుమారుడు బౌన్సర్లు చొచ్చుకు వచ్చారని, వారి వెనకాల రిపోర్టర్లు వచ్చి ప్రశ్నించగా రిపోర్టర్ల మైకు లాగి రిపోర్టర్ రంజిత్ చెవి, ముక్కు, తల భాగంలో గాయపరచడం రౌడీయిజమన్నారు. కార్యక్రమంలో ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కన్వీనర్ గోడం గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదివాసి మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, జిల్లా ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిరా, కుమ్ర గోవింద్, అమల్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇల్లు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్ అన్నారు. శుక్రవారం మావల మండలం వాఘపూర్‌లో మొదలైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లబ్ధిదారులు ఎంపిక సర్వే ప్రక్రియ ప్రారంభించారు. ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులు ఎంపిక సక్రమంగా జరిగేలా మొబైల్ యాప్ ద్వారా లబ్ధిదారులు సమగ్ర సమాచారం నమోదు చేయడం జరుగుతుందన్నారు. సమగ్ర సమాచారం నమోదు చేసిన తర్వాత లబ్ధిదారుల ఎంపిక గ్రామ సభ ద్వారా ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 3500 ఇళ్ల మంజూరు చేశారని, అదనంగా ఏజెన్సీ ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసులకు ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి దుర్గయ్య, మావల మండల యువజన కాంగ్రెస్ నాయకులు కుడ్మెత లవన్ కుమార్, సాగర్, కాంగ్రెస్ మహిళా నాయకురాలు మెస్రం పంచపూల, గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు చందల అశోక్, ప్రకాష్ పాల్గొన్నారు.

సింగరేణి దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి

మందమర్రి : సింగరేణి దినోత్సవ వేడుకలను ఉద్యోగుల కుటుంబాలు, ప్రజలు విజయవంతం చేయాలని ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 23వ తేదీన సింగరేణి దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని ఉత్తమ గహాల ఎంపిక, మహిళలకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 18న మధ్యాహ్నం 3 గంటలకు సిఈఆర్ క్లబ్‌లో త్రోబాల్, బాంబే బ్లాస్ట్, అనంతరం దీపాలంకరణ ఉంటుందని తెలిపారు. దీపాలలో నూనె సింగరేణి యాజమాన్యం ఉచితంగా అందజజేస్తుందని, వేడుకలకు ఏరియ సేవ అధ్యక్షురాలు స్వరూప రాణి దేవేందర్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేస్తారని పేర్కొన్నారు. పోటీలలో పాల్గొనే వారు 7013359316 సంప్రదించాలని, పర్యావరణంతో పాటు అందంగా అలంకరించిన గహాలను 20వ తేదీన సందర్శించి ఉత్తమ గహాలను ఎంపిక చేసి మొదటి, రెండవ బహుమతులతో పాటు 5 కన్సోలేషన్ బహుమతులు అందజేస్తున్నట్లు వెల్లడించారు. పోటీలలో పాల్గొనే మహిళలు 19వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు ఎన్విరాన్మెంట్ కార్యాలయంలో, ఉత్తమ గహాల ఎంపికలో పాల్గొనేవారు 9391791054, తినుబండారాలు, ప్రత్యేకమైన స్టాల్స్ ఏర్పాటు చేయాలనుకునే వారు పర్సనల్ డిపార్ట్మెంట్‌లో 20వ తేదీ లోగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

చెవిలో పువ్వులతో ఉద్యోగుల నిరసన

- ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె కొనసాగింపు
- సమ్మెకు పెరుగుతున్న మద్దతు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపడుతున్న సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం శిబిరం వద్ద ఉద్యోగులందరు చెవిలో పువ్వు పెట్టుకొని వినూత్న నిరసన తెలిపారు. ఉద్యోగులు సమ్మె చేపడుతున్న కూడా ప్రభుత్వ స్పందించకకోవడం దారుణమని అన్నారు. కాగా సమ్మెకు పలువురు తమ మద్దతు తెలియజేశారు. బహుజన్ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్, నేతలు యాదయ్య, పురుషోత్తం, మహేందర్, రవీందర్, టిఎస్ టి టి ఎఫ్ నేతలు నరేష్ చంద్రకాంత్, సిపిఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి కష్టారావు, తదితరులు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు.

సమ్మెకు ఎస్టీయూ మద్దతు

కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నిర్వహిస్తున్న సమ్మెకు ఎస్టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మూగ శ్రీనివాస్, అశోక్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బెజ్జంకి రవీంద్ర ఆధ్వర్యంలో ఎస్టియు జిల్లా శాఖ సమ్మె శిబిరాన్ని సందర్శించి సంపూర్ణ మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా శిబిరాన్ని ఉద్దేశించి జిల్లా అధ్యక్షుడు మూగ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత 18 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో జీవితాలను వెల్లదీస్తున్నటువంటి సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లైన ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు పరిష్కారమయ్యే వరకు పోరడుదామని అన్నారు. అలాగే ఉద్యోగ భద్రత ప్రక్రియ ఆలస్యం అయిన పక్షంలో కనీస వేతనం వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేస్తూ రెగ్యులర్ చేయాలని, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టియు ఆదిలాబాద్ అర్బన్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ చంద్రశేఖర్, పోచారెడ్డి ,జిల్లా ఉపాధ్యక్షులు బత్తురి సత్యనారాయణ, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నాయకుల మద్దతు

సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని రెగ్యులర్ చెయ్యాలని, పే స్కేల్ కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మెకు శుక్రవారం ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలియజేశారు. భావి తరానికి బంగారు బాటలు వేసేది విద్య అయినప్పటికి అదే శాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస ఉద్యోగ భద్రత లేదని, నిజ జీవితంలో అనేక ఒడిదొడుకులను ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్రంలో విద్యారంగ అభివద్ధిలో విద్యాశాఖలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. సమగ్ర శిక్షలో రోస్టర్, మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, వ్రాత పరీక్ష విధానం ద్వారా జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న కమిటిచే ఇంటర్వ్యూలలో కనబర్చిన ప్రతిభ ఆధారంగా ఎంపికై వివిధ స్థాయిలలో విధులు చేపడుతున్నవారే ఉన్నారన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోక పోవటం చాలా బాధాకరని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, నాయకులు ఉన్నారు.

మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలి



నస్పూర్ : సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజావేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద ఉన్న సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే, సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. అంతేగాని సమగ్ర శిక్ష ఉద్యోగులను భయ బ్రాంతులకు గురిచేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వం సమస్యను పరిష్కరించకుండా ఉద్యమాన్ని తప్పుదారి పట్టించడానికి తాత్కాలిక ఏర్పాట్లు చేస్తుందన్నారు. కేజీబీవీ,యూఆర్ఎస్ పాఠశాలల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులతో పని చేయించాలని నిర్ణయించడం సరైనది కాదన్నారు. ఈ విధంగా చేసినట్లయితే ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు నష్టపోతారన్నారు. ఇకనైనా ప్రభుత్వం వారిని చర్చలకు పిలిచి సమ్మె విరమించేలా కృషి చేయాలన్నారు.

రేపు పోస్టల్ ఉద్యోగుల మహాసభలు



నవతెలంగాణ-మంచిర్యాల

15న మంచిర్యాలలోని తాంద్రపాపరాయుడు ఫంక్షన్ హాలులో జరిగే అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం 38వ డివిజన్ మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలో ఉద్యోగ సంఘాల నాయకులు విడుదల చేశారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో గతంలో చేపట్టిన ఉద్యమాల కారణంగా కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ప్రైవేటీకరణను విరమించుకుందని, కొత్త కార్మిక చట్టాలను తీసుకువచ్చి టార్గెట్స్ పేరుతో ఉద్యోగులను వేధిస్తున్నారని ఆరోపించారు. సంఘటిత ఐక్య పోరాటాల ద్వారానే ఉద్యోగ వ్యతిరేక కుట్రలను తిప్పి కొట్టవచ్చని పేర్కొన్నారు. డివిజన్ స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు ఉన్న కార్మిక సమస్యలను చర్చించి పరిష్కారం చూపడానికే జిల్లా కేంద్రంలో డిసెంబర్ 15న డివిజన్ మహాసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. డివిజన్, రాష్ట్ర స్థాయి నాయకులు హాజరై కార్మికులకు దిశా నిర్దేశం చేస్తారన్నారు. ఆదిలాబాద్, మంచిర్యాల డివిజన్ బ్రాంచ్ ప్రాంతంలోని పోస్టల్ ఉద్యోగులతో పాటు ఇతర ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐపీయూ గ్రూప్-సి మంచిర్యాల అధ్యక్షులు ఏ. వెంకటస్వామి, కార్యదర్శి స్వామి, ఉద్యోగ సంఘాల సమన్వయ సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, బీమా ఉద్యోగుల సంఘం నాయకులు ఎ.తిరుపతిరెడ్డి, ఎం.రాందాస్, ఆహ్వాన కమిటి సభ్యులు కిరణ్‌బాబు, రాజేంద్రప్రసాద్, సుదర్శన్, రమేష్ బాబు, చరణ్ పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యల పట్ల క్షమాపణలు చెప్పాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని రిమ్స్ ఎదుట డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ నేపథ్యంలో తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, తనను డిస్మిస్ చేస్తూ చర్యలు తీసుకోవడానికి వారికేం అర్హత ఉందో సమాధానం చెప్పాలని రమాబాయి మహిళా మండలి అధ్యక్షురాలు శోభాబాయి తుల్జపురే అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం సభ్యులతో కలిసి ఆమె మాట్లాడారు. రిమ్స్ ఎదుట అంబేద్కర్ నూతన విగ్రహావిష్కరణ నేపథ్యంలో కొంత మంది దళిత సంఘాల బాధ్యులు తనపై లేనిపోని ఆరోపణలు చేస్తూ బద్నాం చేయాలని చూస్తున్నారన్నారు. తనను సంఘం నుండి తొలగించడానికి వారికున్న అర్హతలు ఏమిటో చెప్పాలన్నారు. కూర్చొని సామరస్య పూర్వకంగా చర్చించుకోవాల్సిన అంశాలను వివాదాస్పదంగా మారుస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని పుస్పూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు అదే పాఠశాలలో బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న తోట నరేంద్ర బాబు పీఆర్టీయూ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు విద్యార్థులను ఉన్నతంగా తీర్చి దిద్దడానికి దాదాపు రూ.6000 వేలు వెచ్చించి స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కళావతి, ప్రధానోపాధ్యాయులు చంద్ర ప్రకాష్ గౌడ్, ఉపాధ్యాయులు చంద్రకాంత్, అశోక్, రాజ శేఖర్, ముత్తన్న, నరేంద్ర బాబు మధుకర్, నాగన్న పాల్గొన్నారు.



రేపు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభలు

నవతెలంగాణ-ఇచ్చోడ

టిఎస్‌యుటిఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఫెడరేషన్ మండల అధ్యక్షుడు మెడపట్ల రాజేందర్ పిలుపునిచ్చారు. మండలంలోని నర్సాపూర్ కాంప్లెక్స్‌లో శుక్రవారం మహాసభ గోడ పత్రాలను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల15న జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో టీఎస్ యూటీఫ్ 6వ మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభలకు విద్యావేత్తలు, అధికారులు, రాష్ట్రస్థాయి టీఎస్ యుటిఎఫ్ నాయకులు విచ్చేసి అనేక విద్యారంగ సమస్యల పట్ల వారి అభిప్రాయాలను తెలియజేస్తారన్నారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చిరుతపులి సంచారంపై గ్రామస్తులకు అవగాహన



నవతెలంగాణ-అదిలాబాద్‌రూరల్

మావల మండలంలోని వాఘాపూర్ గ్రామ శివారులో చిరుతపులి సంచారం అధికమైందని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు శుక్రవారం అటవీ శాఖ బీట్ ఆఫీసర్ విశ్వ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కొలం గుడాలో గ్రామంలో కలిసి గ్రామంలోని పశువుల కాపారులకు, వ్యవసాయాదారులకు అవగాహన కల్పించారు. చిరుత పులి అటవీ ప్రాంతంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకోకుండా అటవీ ప్రాంతంలోని వ్యవసాయ భూములను సాగుచేసే క్రమంలో రైతులందరు ఒంటరిగా వెళ్లకుండా గుంపులు, గుంపులుగా వెళ్ళాలని అటవీ ప్రాంతంలో వ్యవసాయ పనులకు వెళ్లే ముందు డప్పు చెప్పుల్లు, చేసుకుంటూ వెళ్లాలని ఉదయం వ్యవసాయ పనులకు తొందరగా వెళ్ళకండి అని పశువులను అటవీ ప్రాంతంలో వదిలేసి రావొద్దని పశువుల కాపరులు తొందరగా మేకలను, పశువులను, అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లొద్దన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపేల్లి శ్రీధర్, గ్రామ పటేల్ కోడప పోతన్న, గ్రామ దేవరీ చాకటి నాగ రావ్, మావల మండల యువజన కాంగ్రెస్ నాయకుడు కుడిమేత లవన్ కుమార్, గ్రామ యువకులు కోడప భీమ్‌రావ్, కోడప అయ్యు, చకటి దశరథ్ పాల్గొన్నారు.

15న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభ



నవతెలంగాణ-తలమడుగు

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్న ఏకైక సంఘం టీఎస్ యూటిఎఫ్ అని మండల అధ్యక్షుడు కొల్లూరి శంకర్ అన్నారు. శుక్రవారం మండల విద్యాధికారి వెంకట్రావు చేతుల మీదుగా మహాసభ పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ టీఎస్ యుటిఎఫ్ అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహతో నిరంతరం కృషి చేస్తుందని, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వంతో మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో ముందంజలో ఉంటుందని అన్నారు. ఈనెల 15 తేదీన జిల్లా కేంద్రంలో న్యూ అంబేద్కర్ భవన్‌లో నిర్వహిస్తున్న జిల్లా మహాసభకు మండలంలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాస్, మండల కార్యదర్శులు రమేష్, మురళి వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేసి అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-తాంసీ

భీంపూర్ మండలంలోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన జాదవ్ తులసీరాం అనే వ్యక్తి తన ఇంటి పక్కన ఖాళీ స్థలంలో గంజాయి చెట్లు పెంచుతూ గంజాయిని అమ్ముతున్నాడని పక్క సమాచారం మేరకు జైనథ్ సీఐ డి.సాయినాథ్‌తో పాటు భీంపూర్ ఎస్సై ఎండీ కలీం తమ సిబ్బందితో కలిసి శుక్రవారం ఇందిరా నగర్‌లో సోదాలు చేయగా 126 గ్రాముల ఎండు గంజాయి లభించింది. ఇంటి పక్కన ఖాళీ స్థలములో పెంచుతున్న నాలుగు గంజాయి చెట్లను స్వాధీనం చేసుకున్నారు. తులసీరాంపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు జైనథ్ సీఐ డి సాయినాథ్ తెలిపారు. గంజాయి విలువ సుమారు రూ.33,000 ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చాలామంది యువకులు గంజాయికి అలవాటు పడి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, యువకులు గంజాయికి బానిసలు కాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం గంజాయి అమ్మే వారిపై సాగు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలో ఇటీవల నిర్వహించిన మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీల్లో సొనాల గ్రామానికి చెందిన విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సచిన్ తెలిపారు. అలాగే ఎంపికైన జడ్పీహెచ్ఎస్ సోనాల విద్యార్థులను శుక్రవారం మెడల్స్ అండ్ మెమెంటో అందజేసి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పీడీ శైలజ, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

రేపు స్టేడియంలో బేస్ బాల్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీఎం కప్ బేస్ బాల్ మహిళల, పురుషుల జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 15న పట్టణంలోని ఇందిరా ప్రియ దర్శిని స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు డివైఎస్‌ఓ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లోని సీనియర్ క్రీడాకారులు ఉదయం 10 గంటలకు ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలతో జిరాక్స్ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు ఈ నెల 18 నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి సీఎం పోటీలో పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ పట్టణంలోని ఆదర్శనగర్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. నిర్మల్ పట్టణంలోని ఆదర్శనగర్, రాంనగర్, గాయత్రి పురం, ఆశ్రా కాలనీ, ఈద్గాం, భాగ్యనగర్, ఫిష్ మార్కెట్, సిద్ధాపూర్, ఇందిరమ్మ కాలనీ, సోఫినగర్ ఏరియాలో ఉదయం 9: 30 గంటల నుంచి 12:30 గంటల వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.


ఏజెన్సీలో జోరుగా వడ్డీ వ్యాపారం

- తమిళనాడు, ఆంధ్ర వ్యాపారస్తుల ఆగడాలు
- పీసా , 1/70 చట్టానికి తూట్లు
- పల్లెల్లో ఆదివాసులే టార్గెట్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఏజెన్సీలోని పలు గ్రామాల్లో వడ్డీ వ్యాపారుల దందా చాప కింద నీరులా గట్టు చప్పుడుగా కొనసాగుతోంది. నిబంధనలకు విరుద్ధగా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. పీసా చట్టం, 1/70 చట్టాన్ని ఉల్లంఘించి అమాయక గిరిజనులను దోచుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏజెన్సీలో వడ్డీ వ్యాపారం పూర్తిగా నిషేధం అయినా వీరు తమిళనాడు, ఆంధ్ర ప్రాంతం నుంచి వచ్చి జిల్లా కేంద్రంలో మకాం వేశారు. ఆదివాసుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని గ్రామంలో ఓ పెద్దాయన అండదండలతో అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నారు. వీరికి ఎలాంటి లైసెన్సు ఉండదు మనీ లాండరింగ్ కింద వీరి పైకం ఏడాది కాలంలో రెండింతలు చేస్తున్నారు. రూ.5 నుంచి 10 వేలు ఒకరికి ఇచ్చి ఆరు, పన్నెండు వారాలకు వడ్డీతో సహా అసలు వసూలు చేస్తున్నారు. రూ.ఐదు వేలు ఇస్తే ఆరువారాలకు 1250, 10 వెలకు పన్నెండు వారాలకు అంటే (మూడు నెలలకు) 1250 చొప్పున్న వారం వారం కిస్తీల ప్రకారం వసూలు చేస్తున్నారు. ఓ చిన్న డైరీ మీద బాలాజీ, శివ ఫైనాన్స్‌ల పేరిట వడ్డీ, అసలు కిస్తీలు వసూలు చేసి నమోదు చేస్తున్నారు.





ఏడాది కాలంలో రెండింతలు

ఈ అక్రమ వడ్డీ వ్యాపారులు మూడు నెలలకు రూ. లక్ష ఇస్తే 25 వేలు వడ్డీ రూపంలో కూడగట్టుకుంటున్నారు. ఆరు నెలలు రూ.50 వేలు, ఓ ఏడాదికి లక్షకు రెండు లక్షలు అంటే ఏడాదికి తమ పైకాన్ని రెండింతలుగా తమ అక్రమ వడ్డీ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

పొద్దున్నే గడ్డళ్ల వాలుతారు..

తమిళనాడు, ఆంధ్ర ప్రాంతానికి చెందిన అక్రమ వడ్డీ వ్యాపారులు వారానికి ఓ సారి వసూలుకు వస్తుంటారు. వీరు పొద్దున్నే ఇంటివద్ద గడ్డళ్ల వాలుతారు. డబ్బులను వసూలు చేసి క్షణాల్లో వెళ్ళి పోతున్నారు. ఇలా ప్రతి వారానికి పదుల సంఖ్యలో వివిధ గ్రామాలకు వెళ్లి మధ్యాహ్నం వరకు లక్షల్లో వసూలు చేసి వెళుతుంటారు. వీరి అడ్రస్, మొబైల్ నెంబర్ ఎవరికి ఇవ్వకుండా జాగ్రత్త పడి ఫరారై పోతున్నారు. ఎవరైనా గట్టిగా అడిగితే మా సేటు హైదరాబాద్, తమిళ నాడులో ఉంటారని మేము జీత గాళ్ళమే అంటూ అక్రమ వడ్డీ వ్యాపారం చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. వీరిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు ఏజన్సీ లో గుట్టు చప్పుడు కాకుండా కొనసాగుతున్న ఈ అక్రమ వడ్డీ వ్యాపారంపై కొరడా ఝులిపించాలని ఆదివాసులు కోరుతున్నారు.

కుష్టు నివారణ లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కుష్టు నివారణే లక్ష్యంగా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని కుష్టు గుర్తింపు సర్వే రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ ప్రదీప్ కుమార్ అన్నారు. జిల్లాలో కొనసాగుతున్న కుష్టు అనుమానితుల గుర్తింపు సర్వేను ఆయన శుక్రవారం పరిశీలించారు. పట్టణంలోని హమాలీవాడ అర్బన్ హెల్త్ సెంటర్ పరిదిలో పర్యటించారు. ఆశా కార్యకర్తలు నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనుమానితులు తప్పిపోకుండా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కుష్టు గుర్తింపు సర్వే రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ఎన్ సీడీసీ కార్యక్రమంలో భాగంగా కుష్టు అనుమాతుల సర్వే కొనసాగుతుందన్నారు. వీరిని పరీక్షించి కుష్టు ఉందా లేదా ఇతర చర్మ సంబంధిత వ్యాధులున్నాయని తెలుసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో లక్ష 76 వేల 426 ఇండ్లకు గాను లక్ష 54 వేల 25 ఇండ్ల సర్వే పూర్తి అయిందన్నారు. అదే విధంగా 6 లక్షల 39 వేల 106 మందిని పరీక్షించి 800 మంది అనుమానితులను గుర్తించడం జరిగిందన్నారు. ఇంకా రెండు రోజుల సమయం ఉందని వంద శాతం పూర్తి చేసేల ప్రణాళిలు చేసుకోవాలని సూచించారు. కుష్టును ముందస్తుగా గుర్తిస్తే నివారణకు చికిత్సలు పొందవచ్చని తెలిపారు. సర్వేకు వేళ్లే ఆశా కార్యకర్తలు ఏ ఒక్కరు తప్పిపోకుండా పూర్తి స్థాయిలో వివరాలను నమోదు చేయాలన్నారు. తప్పిదలు జరిగితే శాఖ పరంగా చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ నెల 2వ తేదీ నుంచి కుష్టు అనుమానితుల గుర్తింపు సర్వే ప్రారంభమైందని కుష్టు నివారణ అధికారి డాక్టర్ గజానంద్ తెలిపారు. 14 రోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహించి వివరాలను సేకరిస్తున్నామన్నారు. సర్వే కోసం వచ్చే ఆశా, ఆరోగ్య సిబ్బందికి ప్రజలు వివరాలు తెలియజేసి సహకరించాలని కోరారు. ఆయన వెంట కుష్టు నివారణ అధికారి గజానంద్, వామన్ రావ్, సిబ్బంది ఉన్నారు.



ఇంద్రవెల్లి : మండలంలో కొనసాగుతున్న కుష్టు సర్వే శుక్రవారం నాడు రాష్ట్ర పరిశీలకులు డా ప్రదీప్ ఆధ్వర్యములో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక వైద్య సిబ్బందితో కలిసి బుద్ధనగర్‌లో ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. సర్వే తీరును ఆశ వర్కర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమములో జిల్లా కుష్టు నివారణ అధికారి డా.గజానంద్, డా.శ్రీకాంత్, హెచ్ఎస్‌పవార్ రమేష్, జ్యోతి, హెచ్‌ఏ రమేష్, ఆశలు సోను, వనమాల పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారు సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు వారి సమస్యల పరిష్కరం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని విద్యుత్ వినియోగదారుల హక్కుల ఫోరం చైర్‌పర్సన్ ఎరుకల నారాయణ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆదిలాబాద్, దస్నాపూర్, మావల, ఆదిలాబాద్ రూరల్ ప్రాంతాల విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించగా స్పందన లభించింది. లూస్ వైర్లు, అదనపు స్తంభాల ఏర్పాటు, విద్యుత్తు బిల్లుల తప్పిదాలకు సంబంధించి 10 అర్జీలు రాగా అందులో నాలుగింటిని అప్పటికప్పుడే పరిష్కరించారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను తెలుసుకుంటు వాటి పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని విద్యుత్తు వినియోగదారుల హక్కుల ఫోరం చైర్మన్ ఎరుకల నారాయణ అన్నారు. ముందుగా సమస్యలపై కార్యాలయంలో అర్జీలు ఇవ్వాలన్నారు. అక్కడ పరిష్కారం కాకపోయిన, నిర్లక్ష్యం వహించిన తరువాత తమ దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కఠినంతర సమస్యలపై మాత్రమే గ్రీవెన్స్‌లో అర్జీలు పెట్టుకోవాలని సూచించారు. వచ్చిన అర్జీల్లో కొన్నింటిని అప్పటికప్పుడే పరిష్కారించడం జరిగిందని, కొన్నింటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కారిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం సభ్యులు రామకృష్ణ, కిషన్, విద్యుత్తు శాఖ ఎస్ఈ జేఆర్ చౌహన్ ఉన్నారు.

గిరిజన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాథోడ్ గణేష్ అన్నారు. శుక్రవారం ఐటిడిఏ కార్యాలయంలోని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బు గుప్తాను మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న భాషా పండితులను, పీఈటీలను అప్‌గ్రేడ్ చేయాలని, సిఆర్‌టిలను రెగ్యులర్ చేసి, వారికి చెల్లించాల్సిన ఐదు నెలలుగా పెండింగ్‌లో వేతనాలను వెంటనే అందించాలన్నారు. గిరిజన ప్రాంతంలో ఏజెన్సీ డివో పోస్టులను భర్తీ చేసి, ఏజెన్సీ ప్రాంతంలో ఏజెన్సీ డీఎస్సీ వేసి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. టీటీఎఫ్ సంఘానికి కార్యాలయం కోసం ప్రభుత్వం స్థలం కేటాయించాలి. సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీటీఫ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రవీందర్ జాదవ్, జిల్లా, మండల సభ్యులు రామారావు చవాన్, జాదవ్ పవన్‌లాల్, రాథోడ్ దేవిదాస్, జాదవ్ ఈశ్వర్, అడే విఠల్, షేర్ సింగ్, రవీందర్, రాథోడ్ వికాస్ పాల్గొన్నారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోషకుల సమావేశం



నవతెలంగాణ-లోకేశ్వరం

ఇంటర్ బోర్డు కార్యదర్శి ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గౌతం అధ్యక్షతన పోషకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన తల్లితండ్రులకు, విద్యార్థులకు ప్రిన్సిపాల్ గౌతం, కళాశాల అధ్యాపకులు పలు సూచనలు చేశారు. నేటి సమాజంలో పిల్లలు చెడు వ్యాసనాలతో పక్క దారి పడుతూ విలువైన సమయాన్ని వథా, అందమైన జీవితాన్ని చేజేతుల నాశనం చేసుకుంటున్నారని అన్నారు. వారిని సరైన మార్గంలో నడిపించడానికి తల్లితండ్రులు గారబం చేయకుండా కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. మంచి దుస్తులు, భోజనం వద్ద గారాబం చేయవచ్చని చెడు దారిన పోతూ ఉంటే ప్రోత్సహించవద్దన్నారు. మీ మీ కష్టాలను వారికి గుర్తు చేస్తూ వారికోసం కొంత సమయాన్ని కేటాయిస్తూ నిరంతర శ్రద్ధ, నిఘా ఉంచాలని సూచించారు. కళాశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని ఎంతో అనుభవం గల అధ్యాపకులు బోధన చేస్తున్నారని వారి సేవలు మీరు వినియోగించుకోవాలంటే క్రమం తప్పకుండా కళాశాలకు పిల్లలను పంపాలని, అప్పుడప్పుడు కళాశాలకు వచ్చి విద్యార్థుల బోధన సామర్థ్యాలను ఆరా తీయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గౌతం, అధ్యాపకులు విఠల్, వెంకటేశ్వర్లు, వినోద్ కుమార్, ప్రమీల రాణి, శ్రీనివాస్, నవీన్, చిన్నయ్య, మహేందర్, హరీష్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఈ చౌహన్‌కు సన్మానం



నవతెలంగాణ-తలమడుగు

జిల్లా విద్యుత్ శాఖలో ఎస్ఈగా పనిచేస్తున్న చౌహాన్‌కు చీఫ్ ఇంజనీర్‌గా ఉద్యోగోన్నతి లభించిన సందర్భంగా శుక్రవారం ఆయనను మాజీ జడ్పీటీసీ గణేష్‌రెడ్డి సన్మానించారు. సుంకిడి మాజీ ఎంపిటిసి వెంకన్న యాదవ్, బిబిసి స్టీల్, సిమెంట్ షాప్ యజమాని గోవర్ధన్‌రెడ్డి, రావుల నారాయణతో కలిసి ఎస్ఈని సన్మానించారు.

నేడు రజక సంఘం జిల్లా సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని రజక సంఘం భవనంలో జిల్లా కమిటీ ఎన్నిక కోసం ఈ నెల 14న జిల్లాస్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని, రజక సంఘం సభ్యులు, కులస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు కోరారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం బాధ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు జరగబోయే సమావేశానికి మండల, గ్రామీణ ప్రాంతాల నుండి రజకులు తరలివచ్చి భాగస్వాములు కావాలని, తమ సలహాలు, సూచనలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కమిటీ గడువు ముగిసిపోయి యేడాది గడిచిపోయిందన్నారు. కొత్త కమిటీ ఎన్నిక కోసమే ఈ సమావేశం నిర్వహించడం జరుగుతోందని స్పష్టం చేశారు. సమావేశంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

రెండో శనివారం యధావిధిగా పాఠశాలలు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఈ నెల రెండో శనివారం పాఠశాలలు యధావిధిగా పనిచేస్తాయని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో వర్షాల కారణంగా పాఠశాలలకు సెలవు తీసుకున్నామని, దానికి బదులుగా నేడు జిల్లాలోని అన్ని పాఠశాలలు యధావిధిగా పనిచేయాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

పాఠశాల సమయంలో మార్పులు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పాఠశాలల సమయాల్లో మార్పులు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ కోరారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారిణి ప్రణీతను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం దేవేందర్ మాట్లాడుతూ జిల్లాలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయన్నారు. చలి తీవ్రత విపరీతంగా పెరిగిపోతుందని ఉదయం సమయంలో స్కూల్ పిల్లలు చలితో ఇబ్బందులు పడకుండా పాఠశాలల టైమింగ్స్‌ను మార్చాలని కోరారు. ఈ విషయమై డీఈఓ సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

గ్రూప్-2 పరీక్షకు ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ నెల 15, 16 తేదీలలో నిర్వహించే గ్రూప్-2 పరీక్ష నేపథ్యంలో ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్ నుంచి బంగారిగూడ, ఆదిలాబాద్ నుంచి జైనథ్ మండలం పిప్పర్‌వాడకు ఉదయం 8:00 గంటలకు ఆర్టీసీ బస్‌స్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం బస్ స్టాండ్‌లో హెల్ప్ సెంటర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. వివరాల కోసం అభ్యర్థులు 8331033707 నెంబరును సంప్రదించాలని సూచించారు.

16 నుంచి జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఈ నెల 16 నుంచి జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలు ప్రారంభించనున్నట్లు జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ నెల 16, 17, 18, 19 తేదీల్లో పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో కబడ్డీ, ఖోఖో, వెయిట్ లిఫ్టింగ్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, చెస్ తదితర క్రీడలు ఉంటాయన్నారు. వివరాలకు 9951198890 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని బూరుగుడ గ్రామానికి చెందిన సాయి కిరణ్ శ్రీనివాస్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సీఎం సహాయ నిధి వరం లాంటిదన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, తమ ప్రభుత్వ హయాంలో భవిష్యత్తులో మరిన్ని పథకాలు రానున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మండల్ మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గౌడ్, మండల అధ్యక్షుడు మసాడే చరణ్, ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఆసిఫ్, నాయకులు అసద్, రూప్నర్ రమేష్, జమీర్, మాజీ ఎంపీటీసీ తిరుపతి, నాగోసే శంకర్ పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఏఓ మధుకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో ఉండడం లేదన్నారు. ఆస్పత్రులకు సమయపాలన పాటించడం లేదని, దీనివల్ల పేద ప్రజలు ప్రయివేట్ ఆస్పత్రులకు పోవాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. ఇటువంటి వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రాజేందర్ నాయకులు ఆనంద్, శ్రీనివాస్, కార్తీక్, మాలశ్రీ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు త్వరలో పరిష్కారం

- టీయూడబ్ల్యూజే నాయకుడు నగునూరి శేఖర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులకు త్వరలో తీపి కబురు అందుతుందని టీయూడబ్ల్యూజే నాయకుడు నగునూరి శేఖర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి వచ్చిన సందర్భంగా టీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆయనకు శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల సమస్య, హెల్త్ కార్డుల సమస్యలు పరిష్కారం అవుతాయని త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి ప్రకటిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ విలేకరుల కోసం ప్రత్యేక శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, టీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు ఎస్ తారు, మేకల శ్రీను, రాధాకృష్ణ చారి, బిక్కాజీ, తిరుపతిచారి, అబ్దుల్ హన్నాన్, విజయ్, సాయి, రవి, శంకర్ పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి సరికాదు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జర్నలిస్టులపై దాడి సహించేది లేదని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ అన్నారు. శుక్రవారం టియుడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ విధి నిర్వహణలో ఉన్న మీడియా ప్రతినిధులపై సినీ నటుడు మోహన్ బాబు దాడి చేయడం సిగ్గుచేటు అన్నారు. జర్నలిస్టులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోహన్ బాబుపై హత్య నేరం కింద కేసు నమోదు చేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, టీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు తారు, బిక్కజి, దేవనూరి రమేష్, రాధాకష్ణ చారి, అబ్దుల్ హన్నాన్, తిరుపతి చారి, రాజు, మేకల శ్రీనివాస్, వారణాసి శ్రీనివాస్, రమేష్, మిలీన్ కుమార్, మోయిన్, సాయి, రవి, నరేష్, నాగేష్ పాల్గొన్నారు.

ఆదివాసీ కోలావార్ సంక్షేమానికి పోరాటం



నవతెలంగాణ-బెజ్జూర్

ఆదివాసీ కోలావర్ సంక్షేమం కోసం తన ప్రాణాలు ఉన్నంత వరకు పోరాటం చేస్తానని ఆదివాసీ కోలావర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుర్స పోచయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కోలాంలు తమకు శత్రువులు కారని, కోలాంల ఉప తెగనే మన్నేవార్లు అన్నారు. మన్నేవార్లను గిరిజన జాతులు నుండి తొలగించాలని అనడం అన్యాయమన్నారు. కోలాం జాబితాలో మన్నేవార్ల కులాన్ని తొలగించే కుట్రలు జరుగుతున్నాయన్నారు. ఆదివాసి కోలావార్ల కోసం ప్రాణాలకు తెగించి కొట్లాడుతానన్నారు. కొలాంలు తమపై దాడి చేసే ప్రయత్నాలు చేస్తున్నారని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈనెల 16న కొలాంలు ఉట్నూరులో నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాల వల్ల అంతర్గతంగా కులాల మధ్య యుద్ధం ప్రమాదం ఉందన్నారు. పీవీటీజీ నుంచి మన్నేవార్లను తొలగించడం అన్యాయమన్నారు. కొలావార్లకోసం గ్రామాల్లో గిరిజనులను చైతన్యపరిచి సంఘ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి రాష్ట్ర కమిటీ నాయకులు సత్యక్క, మండల అధ్యక్షులు బక్కయ్య నాయకులు పోల్క వెంకటేష్, పెద్దల సంతోష్, మానేపల్లి మల్లేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని భుక్తాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ సదానందం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యానగర్, భుక్తాపూర్, ద్వారకానగర్, సినిమా రోడ్, మోచిగల్లీ, రాణిసతిజీ కాలనీ ఏరియాలల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చలో ఐటీడీఏను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-కెరమెరి

ఈ నెల 16న చలో ఐటీడీఏ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొలాం సంఘం మండల అధ్యక్షుడు సిడాం ధర్ము అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద చలోకు సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్నెవార్లను 'కొలావార్'గా మార్చడంలో కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర వహించిందన్నారు. మన్నెవార్‌లు కొలావార్‌లు అవునా కదా అనే అంశాన్ని పున:పరిశీలన చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీ వేసి మరోసారి విచారణ చేపట్టి వాస్తవాలను కేంద్ర ప్రభుత్వానికి అందజేయాలన్నారు. 2021లో గిరిజన శాఖ కమిషనర్ మన్నెవార్లను పివిటీజీలుగా గుర్తింపు నివ్వాలని కేంద్ర ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం మన్నెవార్లకు కొలవార్‌గా ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారని, అలా జారీ చేయడం సరైంది కాదన్నారు. వారు ఎస్టీలైనప్పటికి వారికి మన్నెవార్‌గా ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలన్నారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో కొలవార్ సమాజం అస్తిత్వం కోల్పోయే ప్రమాదముందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు మన్నెవార్లకు, కొలవార్‌గా జారీ చేయబడిన ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అందులో బాగాంగానే చలో ఐటిడీఎకు పిలుపు ఇచ్చామని తెలిపారు. జిల్లాలోని కొలవార్‌లో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం కొలాం సంఘం ప్రధాన కార్యదర్శి సిడాం భీంరావు, సూరు ఉత్సవ కమిటీ చైర్మన్ సిడాం రాజు, మారుతీ, తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు సోము, టేకం భీము, రాజు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్ష పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రూప్-2 పరీక్ష కొరకు జిల్లాలో ఏర్పాటు చేసిన 18 పరీక్ష కేంద్రాలలో పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ పరీక్షల నోడల్ అధికారి దీపక్ తివారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 15, 16 తేదీలలో నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రం ప్రాంగణం, ముఖ్య పర్యవేక్షకులు గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి పర్యవేక్షించాలని, అవసరమైన ఫర్నిచర్, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 15, 16 తేదీల్లో ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం 2 పేపర్లు ఉంటాయని, పరీక్ష కేంద్రంలో అనుమతిలేని సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, షఉలు గేటు బయట తీసుకొని పరీక్షా సమయం పూర్తయ్యే వరకు భద్రపరచాలని, అభ్యర్థులు పరీక్ష సమయానికి గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. ఉదయం పరీక్షకు 9:30 గంటలకు, మధ్యాహ్నం పరీక్షకు రెండున్నర గంటలకు గేట్లు మూసి వేయడం జరుగుతుందని, తదుపరి ఎవరిని అనుమతించవద్దని తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పీటీజీ గురుకుల బాలుర పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న గ్రూప్ టూ పరీక్షల కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య పర్యవేక్షకులు, శాఖ అధికారులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

17న కలెక్టరేట్ ఎదుట వంటావార్పు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 17న కలెక్టరేట్ ఎదుట వంటావార్పు నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వెలిశాల కృష్ణమాచారి అన్నారు. శుక్రవారం జిల్లా పరీక్షల సహాయ సంచారకులు ఉదయబాబుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం, గుడ్ల బిల్లు వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 17న కార్మికులు మధ్యాహ్న భోజనం బంద్ చేసి కలెక్టరేట్ ఎదుట వంటావార్పు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి పగిడి మాయ, తిర్యాని అధ్యక్షురాలు మడావి చంద్రకళ, నాయకులకు పద్మా, ఊర్మిళ, సునీత పాల్గొన్నారు.

ఆదర్శం అంగన్‌వాడీ కేంద్రం

నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనిలో ఉన్న పూరాత అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు చేయడంతో అటువైపుగా వెళ్లే వారిని ఆకట్టుకుంటోంది. అంగన్‌వాడీ ఆటాపాటలతో కూడిన విద్యను అందిస్తున్నారు. మూడేళ్లలోపు చిన్నారులకు ప్లాస్టిక్ బొమ్మలు, ఇతర ఆట వస్తువులు అందుబాటులో ఉంచారు. పూర్వ ప్రాథమిక విద్యతోపాటు చిత్రలేఖనం వంటి అంశాలపై కూడా పిల్లలకు అవగాహన కల్పిస్తున్నారు. 4 నుంచి 5 ఏండ్లలోపు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యతో కూడిన ఆంగ్ల విద్యను అందిస్తున్నారు. ప్రతిరోజూ ఆర్ట్, క్రాఫ్ట్, భాషా పరిచయం, నేను నా పరిసరాలు వంటి అంశాలను వివరిస్తున్నారు. అంగన్‌వాడీ





కేంద్రాన్ని ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రంగా తీర్చిదిద్దడంతో పిల్లలు కేంద్రానికి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రం కళకళలాడుతోంది. చిన్నారులను మరింత ఆకట్టుకునే విధంగా ఆదర్శ కేంద్రానికి ఆకర్షణీయమైన రంగులతో బొమ్మలు వేశారు. చిన్నారులకు ఆటాపాటలతో ఆహ్లాదాన్ని పంచుతున్నారు. రంగులు, బొమ్మలు ఆహ్లాదకరమైన వాతావారణం కేంద్రాల్లో ఏర్పాటు చేయడంతో పిల్లల వీటిపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య పెరుగుతున్నది. మండలంలో మిగతా అంగ్‌వాడీ కేంద్రాలను ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రాలుగా తీర్చి దిద్దాలని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో క్రాప్ బుకింగ్ సర్వే

నవతెలంగాణ-కెరమెరి

గ్రామాల్లో క్రాప్ బుకింగ్ సర్వే చేపట్టినట్లు ఇన్‌చార్జి మండల వ్యవసాయ అధికారి యుగేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని బోరిలాల్ గూడా, జన్కాపూర్ పంట పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా పంట పొలాల్లో పండిస్తున్న పంటల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి రైతు పొలం వద్దకు అధికారి ప్రత్యక్షంగా వెళ్లి ఫొటోలు తీసి అక్కడి నుంచే ఆన్‌లైన్‌లో నమోదు(అప్‌లోడ్) చేసేందుకు 'క్రాప్ బుకింగ్' పేరుతో మొబైల్ యాప్‌ను ప్రభుత్వం సిద్ధం చేసిందన్నారు. పొలాల సర్వే నెంబర్ల వారీగా వారి పర్యటనలన్నింటినీ జియో ట్యాగింగ్ ద్వారా లెక్కించేందుకు రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ నుంచి ఉపగ్రహంతో చిత్రీకరించేందుకు ఆ యాప్‌ను ఉపయోగిస్తారని తెలిపారు. ఆయనతో పాటు సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు రాథోడ్ రమేష్ ఉన్నారు.

వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం పెట్టాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-బోథ్

వసతి గృహాల్లో నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు వండిన భోజనాన్ని, విద్యార్థులకు అందించే బియ్యాన్ని సరుకులను పరిశీలించారు. సరుకులు కుల్లిపోకుండా జాగ్రత్తగా భద్రపరచాలని, బియ్యం ఏ రోజుకారోజు సరిపడినంత తీసుకొని వాడుకోవాలని, బియ్యం కింద పడేసి వృథా చేయొద్దని సూచించారు. అనంతరం ఆర్ఓ ప్లాంట్‌ను పరిశీలించారు. వంట చేసేటప్పుడు, విద్యార్థులకు భోజనం వడ్డించే క్రమంలో చేతులను శుభ్రంగా కడుక్కొని భోజనం చేయాలని, వంటవారు చేతులకు గ్లౌస్, తలకి టోపీ పెట్టుకోవాలని సిబ్బందికి సూచించారు. వసతి గృహాలకు సరఫరా చేస్తున్న బియ్యం ఇతర సరుకులు కూరగాయలు బాగా లేనట్లయితే తిరిగి పంపించి నాణ్యతా గల వస్తువులు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఉపాధ్యాయులు రోజు పాఠశాలకు వస్తున్నారా లేదా, పాఠాలు అర్థమయ్యేలా చెబుతున్నారా, ఇప్పటి వరకు ఎన్ని ఛాప్టర్లు పూర్తయ్యాయి అంటూ విద్యార్థినులకు అడిగి తెలుసుకున్నారు. భోజన సౌకర్యం, ఇతర మౌలిక సదుపాయాల విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను పెంపొందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం మంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వినోద్ కుమార్, తహసీల్దార్ సుభాష్ చంద్ర, ప్రత్యేకాధికారి మహ్మద్ వహీద్, ప్రధానోపాధ్యాయులు శంకర్, వార్డెన్ ప్రియ, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



నవతెలంగాణ-ముథోల్

ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలను ప్రతి కార్యకర్త ఎండగట్టాలని మంత్రి సీతక్క పిలుపు నిచ్చారు. శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క జిల్లా పర్యటనలో భాగంగా బాసరలో జీఎస్ గార్డెన్‌లో కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. మంత్రి సీతక్కకు మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, నారాయణరావు పటేల్ ఘన స్వాగతం పలికారు. ఈ సందంర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రైతు భరోసాను ప్రభుత్వం తప్పక అందిస్తుందన్నారు. ప్రతిపక్ష పార్టీలు కావాలనే రైతు భరోసాపై తప్పుడు ప్రచారం చేపడుతున్నాయని, రైతులు నమ్మొద్దని అన్నారు. వరి రైతులకు అందిస్తున్న రూ.500 బోనస్, 200 యూనిట్ల కరెంటు మాఫీ, ఉచిత బస్సు, పథకాలు, ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసిన అంశాన్ని విస్తతంగా ప్రచారం చేయాలన్నారు. దిలావర్‌పూర్‌లో ఇథనాల్ ఫ్యాక్టరీకి అనుమతులను గత బీఆర్ఎస్ ప్రభుత్వమే ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పుడు బీఆర్ఎస్ నాయకులు రైతులను రెచ్చగొట్టి ఉసి గోల్పోతున్నారని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి, నారాయణరావు పటేల్ ట్రిబుల్ ఐటీ, బాసర ఆలయాన్ని అభివృద్ధి పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, ఎమ్మెల్సీ దండే విఠల్, ఆత్రం సుగుణ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీని సందర్శించిన మంత్రి



నవతెలంగాణ-ముథోల్

విద్యార్థుల సమస్యలను సావధానంగా విన్నాను, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానంటూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే రామారావు పటేల్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్సీ దండే విటల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి యూనివర్సిటీని సందర్శించారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్‌లో విద్యార్థులతో మంత్రి సీతక్క మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సరిపడా ఫాకల్టీలు లేకపోవడంతో చదువుకు ఇబ్బందులు కలుగుతున్నాయని, 60 శాతం మంది విద్యార్థినులు ఉన్న యూనివర్సిటీలో రెగ్యులర్ గైనకాలజిస్ట్‌ను నియమించాలని, మహిళా కేర్ టెకర్లను నియమించాలని, గతంలో ఉన్న మెస్ యాజమాన్యాలే ఉన్నాయని వారిని మార్చాలని, మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చి తక్షణం రూ.కోటి యూనివర్సిటీకి మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్జీయుకేటి ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మంచిర్యాల
శనివారం | డిసెంబర్ 14, 2024 | www.navatelangana.com

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలించిన ఎంపీడీఓ



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొనకల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని రాంనగర్‌లో శుక్రవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఎంపీడీఓ శశికళ పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇండ్ల యాప్లో వచ్చిన పేర్ల ఆధారంగా మండలంలోని పోన్కల్ గ్రామ ఈఓ రాహుల్ ఆధ్వర్యంలో సిబ్బంది పట్టణంలోని రామనగర్ ఇందిరమ్మ ఇండ్ల సర్వేను నిర్వహిస్తున్నారు. దీంతో శుక్రవారం ఎంపీడీఓ శశికళ అక్కడికి వెళ్లి సర్వేను పరిశీలించారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓ రాహుల్, సిబ్బంది ఉన్నారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత



నవతెలంగాణ-జన్నారం

ఇందన్‌పల్లి అటవి రేంజ్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ శుక్రవారం పట్టుకున్నారు. అర్ధరాత్రి ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు చేయగా మొర్రిగూడ వాగులో ఇసుక నింపుతున్న ఒక ట్రాక్టర్, కలమడుగు నుంచి ధర్మారం వైపు వెళుతున్న మరో ట్రాక్టర్‌ను పట్టుకుని రేంజ్ కార్యాలయానికి తరలించారు. మరోసారి పట్టుబడితే కేసు చేయడం జరుగుతుమ్దని హెచ్చరించారు. ఆయన వెంట సెక్షన్ అధికారి రవి, బీట్ అధికారి ముజీబోద్దీన్‌లు ఉన్నారు.

క్రీడా రంగాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-తాండూర్

క్రీడా రంగాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత తెలిపారు. ఆమె శుక్రవారం బెల్లంపల్లి సిఓఈ గురుకులంలో సీఎం కప్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్వేత మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం విద్యా, క్రీడ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలనే లక్ష్యంతో మెనూ చార్జీలను పెంచిందన్నారు. విద్యార్థులు మంచి ఆహారాన్ని తీసుకుంటూ వ్యాయామం చేస్తూ క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని తెలిపారు. నైపుణ్యత గల క్రీడాకారులకు ప్రభుత్వం ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ క్రీడ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ హరికృష్ణ, శ్రీనివాసరావు, ఎంపీడీవో మహేందర్, మాజీ మార్కెట్ చైర్మన్ కారుకురి రాంచందర్, మాజీ గ్రంథాలయ చైర్మన్ తొంగల మల్లేశం, మాజీ ఎంపీటీసీ ముడిమడుగుల మహేందర్, ఎంఈఓ పోచయ్య సీఈఓ ప్రిన్సిపల్ శ్రీధర్, సిఐ దేవయ్య , కౌన్సిలర్ ఆస్మా షేక్ పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల్లో ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండల స్థాయి సీఎం కప్ పోటీలలో ఆశ్రమ పాఠశాల విద్యార్థునులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగు సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ బండ జీవరత్నం తెలిపారు.. శుక్రవారం స్థానిక ఎంజెపి పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి సీఎం కప్ పోటీలలో చక్కని ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచారు. జూనియర్స్ విభాగంలో వాలీబాల్, కోకో, అథ్లెటిక్స్ విభాగంలో చక్కని ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ అభినందించారు.

అభ్యుదయ రైతులకు ఉత్తమ రైతు పురస్కారం



నవతెలంగాణ-తాండూర్

వ్యవసాయ విశ్వవిద్యాలయం స్థాపించి 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పొలాస, జగిత్యాలలో ఏర్పాటు చేసిన డైమండ్ జూబ్లీ ఉత్సవాల్లో మంచిర్యాల, కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన అభ్యుదయ రైతులతో పాల్గొనటం జరిగిందని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివకృష్ణ తెలిపారు. బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రతిపాదించిన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలానికి చెందిన ఎగ్గడి స్వామికి శాశ్వత పందిళ్లలో తీగజాతి కూరగాయల సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధించినందుకుగాను ఉత్తమ రైతు పురస్కారం దక్కిందన్నారు. అదే విధంగా కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరికి చెందిన కేంద్రీ బాలాజీ ఆపిల్, ప్యాషన్ ఫ్రూట్ సాగుచేస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నందుకుగాను ఉత్తమ రైతు పురస్కారం లభించిందన్నారు. విశిష్ట అతిథి, శాసనమండలి సభ్యులు జీవన్ రెడ్డి, జగిత్యాల నియోజకవర్గ శాసన సభ్యులు సంజయ్, ధర్మపురి నియోజకవర్గ శాసన సభ్యులు ప్రభుత్వ విప్, లక్ష్మణ్ చేతుల మీదుగా అభ్యుదయ రైతు పురస్కారం అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి ప్రోగ్రాం కోఆర్డినేటర్, కోట శివకృష్ణ, శాస్త్రవేత్తలు, స్రవంతి, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరలో అంతరాయం

నవతెలంగాణ-లక్షెట్టిపేట

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ గణేష్ తెలిపారు. శనివారం లక్షెట్టిపేట సబ్‌స్టేషన్ పరిధిలో లక్షెట్టిపేట, ఊత్కూర్ పరిధిలో నెలవారి మరమ్మత్తులు నిమిత్తం 11కేవీ లైన్‌లో చెట్టు కొమ్మల తొలగింపు ఉన్నందున ఉదయం 10 గంటల నుండి 11 గంటల 30 నిమిషాల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రూప్-2ను సమర్థవంతంగా నిర్వహించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

గ్రూప్-2 పరీక్షను సమర్థవంతంగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో డీసీపీ భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, అదనపు డీసీపీ రాజులతో కలిసి ముఖ్య పర్యవేక్షకులు, పరిశీలకులు, రూట్ అధికారులతో పరీక్ష నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష నిర్వహణకు 48 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 14,951 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నారన్నారు. పరీక్ష నిర్వహణకు నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, పోలీస్ నోడల్ అధికారిగా బెల్లంపల్లి ఏఆర్ ఏసీపీ సుందర్, రీజియన్ కోఆర్డినేటర్‌గా బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ దేవేందర్‌రెడ్డిలను నియమించడం జరిగిందని, ప్రతి పరీక్ష కేంద్రానికి ముఖ్య పర్యవేక్షకులు, ఇన్విజిలేటర్లు, శాఖ అధికారులు, ఐడెంటటి, బయోమెట్రిక్ వెరిఫికేషన్, రూట్, జాయింట్ రూట్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించడం జరిగిందన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య సిబ్బంది, పోలీసు సిబ్బంది అందుబాటులో ఉంటారని, తాగునీరు, మూత్రశాలలు, నిరంతరం విద్యుత్ సరఫరా ఇతర అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు.

ప్రతి ఉద్యోగి రక్షణలో భాగస్వామి కావాలి



నవతెలంగాణ-మందమర్రి

ప్రతి ఉద్యోగి రక్షణలో భాగస్వామి కావాలని రక్షణ కమిటీ కన్వీనర్, జీఎం (ఆర్ అండ్ డి) నారాయణ రావు కార్మికులకు సూచించారు. రక్షణ పక్షోత్సవాలలో భాగంగా శుక్రవారం సేఫ్టీ కమిటీ కన్వీనర్, జీఎం(ఆర్ అండ్ డి) నారాయణ రావు, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి దేవేందర్ ఏరియా సేఫ్టీ అధికారి రవీందర్ కేకే ఓసిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి రక్షణలో భాగస్వామి కావాలని రక్షణ కమిటీ కన్వీనర్, జీఎం (ఆర్ అండ్ డి) నారాయణ రావు అన్నారు. మందమర్రి ఏరియ జనరల్ మేనేజర్ దేవేందర్ మాట్లాడుతూ రక్షణ కోసం ఉద్యోగులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేసిన రక్షణ పరికరాలను పనిముట్లను వాడాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని అన్నారు. రక్షణ జాగ్రత్తలపై ఉద్యోగులకు అర్థమయ్యే రీతిలో లఘు నాటిక అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, సీఎంఓఏఐ అధ్యక్షుడు రమేష్, రఘు కుమార్ జీఎం సేఫ్టీ బెల్లంపల్లి రీజియన్, సునీల్ వర్మ డీజీఎం ఆర్ అండ్ డి రామకృష్ణ, డీజీఎం ఈ అండ్ ఎం సెంట్రల్ స్టోర్స్ కార్పొరేట్, లక్ష్మి రాజు ఎస్ఎస్ఓ జీఎం ఆర్జి-1, భాస్కరరావు అడిషనల్ మేనేజర్ ఎన్విరాన్మెంట్ కార్పొరేట్, డాక్టర్ లోకనాథ్‌రెడ్డి, డీవై మెడికల్ సూపరింటెండెంట్ ఆర్కే-8 డిస్పెన్సరీ శ్రీరాంపూర్, శ్రీరామ్ సీనియర్ ఎమ్మెస్ ఆర్ ఆర్ టి మందమర్రి ఏరియ, కిషన్‌రెడ్డి, ఎలక్ట్రికల్ ఫోర్ మెన్ శ్రావణ్ కుమార్, మెకానికల్ ఫోర్ మెన్, కేకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, గని మేనేజర్ రామరాజు, సంక్షేమాధికారి సందీప్ పాల్గొన్నారు.

సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం నస్పూర్ మున్సిపల్ పరిధిలోని 22, 24 వార్డులలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇండ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం నీడ కల్పించాలని ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్లు అందించడం జరుగుతుందని, ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల వివరాలను, ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇండ్ల యాప్ లో పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన..

జిల్లా కేంద్రంలో మహిళ సమాఖ్య భవనం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల మున్సిపల్ పరిధిలోగల పాత మంచిర్యాల ప్రాంతంలో మహిళ సమాఖ్య భవన ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

భూములను తీసుకునే ప్రయత్నాలు మానుకోవాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ఆదివాసీ గిరిజన గ్రామాల్లో భూములను దేవాపూర్ సిమెంట్ కంపెనీ కోసం తీసుకునే ప్రయత్నాలను మానుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కొత్త తిర్మలాపూర్ ఆదివాసీ గూడాన్ని సీపీఐ నాయకులు సందర్శించి అక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంకె రవి మాట్లాడుతూ కాసిపేటలోని దేవాపూర్ సిమెంట్ ఫ్యాక్టరీ విస్తరణ పేరుతో ప్రభుత్వం, అధికారులు ఆదివాసీల భూములను, వారి జీవితాలను పణంగా పెట్టడం సోచనీయమని, తాత ముత్తాతల నుంచి వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న వారి జీవితాలను చిన్న భిన్నం చేయాలని చూసే పద్ధతిని మానుకోవాలని సూచించారు. కొత్త తిర్మలాపూర్‌తో పాటు మండలంలో మరి కొన్ని ఆదివాసీ గూడాల్లో భూములు తీసుకోవడం కోసం జరిగే ప్రయత్నాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసుల భూముల జోలికి వస్తే పోరాటం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు పాయిరాల రాములు, టేకం శంకర్, ఆత్రం భీం బాయి, టేకం భీం బాయి పాల్గొన్నారు.

అడవుల సంరక్షణపై అవగాహన

నవతెలంగాణ-జన్నారం

అడవుల సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని ఎఫ్‌బీఓ లాల్ భాయ్ అన్నారు. శుక్రవారం జన్నారం అటవీ డివిజన్‌లోని, జింకల పునరావాస కేంద్రం, బటర్ ఫ్లై గార్డెన్ గోండ్ గుడా బేస్ క్యాంపులలో రోటిగూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు మొక్కలు నాటాలన్నారు. అవి వృక్షాలుగా తయారై వాతావరణ సమతుల్యతకు ఉపయోగపడతాయన్నారు. అటవీ అధికారులు విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పిండి గిర్నీల ధరల పెంపు



నవతెలంగాణ-మందమర్రి

నిత్యవసర ధరల పెరుగుదల నేపథ్యంలో తప్పనిసరి పరిస్థితిల్లో పిండి గిర్నీల ధరలను పెంచుతున్నట్లు, దీనిలో భాగంగా శుక్రవారం బందు నిర్వహిస్తున్నామని, ప్రజలు సహకరించాలని పిండి గిర్నీల అసోసియేషన్ అధ్యక్షుడు సల్వాజి శేషగిరిరావు తెలిపారు. పట్టణంలోని ప్రతి పిండి గిర్నీ యజమానులు సంఘం నిబంధనలు పాటించాలని లేని పక్షంలో రూ.1000 జరిమాన విధించనున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా యజమానులు తక్కువ రేట్లకు పట్టించినట్లయితే రూ.ఐదువేల జరిమాన విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు నర్సింగోజు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి భోగి వెంకటేశ్వర్లు, కోశాధికారి భోజనపల్లి శ్రీనివాస్, ఎండీ జహీర్, వీర భద్రచారి, రంగసాయి కృష్ణ, అశోక్, అజిమొద్దీన్, రియాజ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-కాసిపేట

ఆల్ ఇండియా దళిత్ రైట్స్ మూమెంట్(ఏఐడీఆర్ఎం) జాతియ 2వ మహా సభలను విజయవంతం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఇన్‌చార్జి చాగం మల్లేష్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహా సభలు వచ్చే నెల జనవరి 5,6,7 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే మహాసభలకు తరలి రావాలని కోరారు. జాతీయ మహాసభలకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖ నాయకులు, ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు డీఆర్ శ్రీధర్, జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, నాయకులు నక్క వెంకటస్వామి, మారవెల్లి రవి, జాడి పొచ్చన్న, బొంతల లక్ష్మీ నారాయణ, మొగిలి లక్ష్మణ్, లింగాల వెంకటేశ్వర్లు, మామిడి గోపి, పులి శంకర్, దాగం రాజలింగు, కుర్మ నర్సయ్య, ఇరియాల సుందరం పాల్గొన్నారు.

జిల్లా బీసీ అభివృద్ధి అధికారిగా అదనపు బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-నస్పూర్

జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిగా జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్ శుక్రవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

విధ్వంసం సృష్టిస్తున్న కోతులు



నవతెలంగాణ-నస్పూర్

గత కొన్ని రోజులుగా నస్పూర్ కాలనీ, షిర్క్, నాగార్జున కాలనీలలో కోతులు సంచరిస్తూ కార్మికుల ఇండ్లలోకి చొరబడి విధ్వంసం సృష్టిస్తున్నాయని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి అనిల్‌రెడ్డి ఆరోపించారు. దీంతో కార్మిక కుటుంబాలు ఇంట్లో నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారని అన్నారు. గురువారం రాత్రి కోతుల గుంపు వచ్చి నాగర్జున కాలనీలోని 3327 క్వార్టర్‌లోని ఇంట్లోకి చొరబడి ఇంటి ముందు షెడ్డుపై ఎక్కి రేకులను పగలగొట్టాయన్నారు. వస్తువులను చిందరవందర చేస్తూ కనిపించిన వారిపై దాడి చేశాయన్నారు. అజయ్ అనే కార్మికుని ఇంటి ముందు షెడ్డు కూలిపోయిందని, ఆ సమయంలో కుటుంబ సభ్యులు, పిల్లలు ఇంటి వెనకాల ఉండడం వల్ల ప్రాణాపాయం తప్పిందని అన్నారు. సింగరేణి యాజమాన్యం స్పందించి కోతుల బెడదను నివారించాలని యాజమాన్యానికి కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | డిసెంబర్ 14,2024 | www.navatelangana.com

విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని డీఐఈఓ రవీందర్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలను డీఐఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతం ప్రాక్టికల్స్ ల్యాబ్‌లు పరిశీలించారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని ఆధ్యాపకులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ జాదవ్ గణేష్ కుమార్ అధ్యాపకులు సిబ్బంది ఉన్నారు.



కమ్యూనిటీ హాల్‌కు నిధులు కేటాయించాలి

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన గల జర్నలిస్ట్ కాలనీలో నూతనంగా నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు నిధులు మంజూరు చేయాలని శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ముధోల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు షఫీఉల్లాఖాన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. మంత్రి బాసర పర్యటన ముగించుకుని నిర్మల్‌కు వేళ్తుండగా ముధోల్ గురుకుల పాఠశాల దగ్గర మంత్రి కొంతసేపు వాహనం ఆపారు. దీంతో జర్నలిస్టులు కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు కోలేకర్ పోతాజీ, మహేందర్ గౌడ్, ఓమేష్, మురళీ గౌడ్, రాజేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మహిళలకు చట్టాలపై అవగాహన



నవతెలంగాణ-వాంకిడి

జిల్లా ఎస్పీ డీవీ.శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావు పర్యవేక్షణలో మండలంలోని బండార గ్రామంలో షీ టీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం ఇంచార్జి సునీత మాట్లాడుతూ మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలకు ఎవరైనా గుర్తైనట్లయితే వెంటనే షీటీంను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాలు ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్స్‌టగ్రామ్ వంటి వాటి వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా జిల్లాలోని మహిళలకు రక్షణ కల్పించడం కోసమే షీటీంలు పనిచేస్తున్నాయని, అలాగే ఏదైనా అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని పేర్కొన్నారు. షీటీం ఆసిఫాబాద్ ఫోన్ నంబర్ 8712670564కు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ మహేష్‌బాబు, ఉపాధ్యాయ సిబ్బంది, షీటీం సభ్యులు శ్రీలత, స్వప్న పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



నవతెలంగాణ-వాంకిడి

అక్రమంగా తరలిస్తున్న పశువుల వాహనాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లంజన్ వీర గ్రామ ఎక్స్ రోడ్డు వద్ద ఎస్ఐ ప్రశాంత్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమతులు లేకుండా టీఎస్ 20 టీ 6061 అనే బొలెరో వాహనంలో మహారాష్ట్ర వైపు నుంచి ఆసిఫాబాద్ వైపుకు విక్రయించేందుకు 8 పశువులను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద పశువులకు సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకపోవడంతో, అక్రమంగా రవాణా చేస్తున్న వ్యాపారి మొహమ్మద్ మోహిముద్దీన్ అలీ, సోనేరావ్ అకిని, రియాజ్ ఖురేశి లపై కేసు నమోదు చేశారు. పట్టుకున్న పశువులను కాగజ్‌నగర్ గోషాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-బోథ్

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీని శుక్రవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.రాజు, ప్రధాన కార్యదర్శిగా డి.రంజిత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తమపై నమ్మకంతో పదవి కట్టబెట్టినందుకు ఉపాధ్యాయులకు సర్వీస్ విషయంలో నిరంతరం అందుబాటులో ఉంటూ సహకారం అందిస్తామన్నారు. న్నికల అధికారిగా సోషల్ మీడియా కన్వీనర్ కొల్లూరి శంకర్ వ్యవహరించారు.

వెంగ్వాపేట్ గ్రామ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-నిర్మల్ రూరల్

మండలంలోని వెంగ్వాపేట్ గ్రామంలో శుక్రవారం అంబేడ్కర్ యువజన మాదిగ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉల్లెంగ సాయన్న, ఉపాధ్యక్షుడిగా గడ్డం అజయ్, కోశాధికారిగా గడ్డం జనార్దన్, రైటర్ గడ్డం రమేశ్ ఎన్నికయ్యారు. దీంతో వారికి కుల సంఘ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

అంజిలో ఫులాజి బాబా వార్షికోత్సవం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని అంజి గ్రామములో ని సిద్ధేశ్వర సంస్థానంలో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు వార్షికోత్సవం జరుపుకొనున్నట్లు ఆంధ్ సంఘం నాయకులు ముఖాడే విష్ణు, కూడే కైలాస్‌లు పేర్కొన్నారు. అంజి లోని సిద్ధేశ్వర సంస్థానికి 35 ఏండ్లు పూర్తి కావస్తోందని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి కుల సంఘాలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మహిళల అభివృద్ధే సమాజ అభివృద్ధి

- రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



నవతెలంగాణ-నిర్మల్

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, మహిళా, శిశు సంక్షేమ శాఖ, ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం నిర్మల్ కలెక్టరేట్ ప్రాంగణంలో అంబులెన్సులు, ఇందిరా మహిళా శక్తి, విజయ డైరీ క్యాంటీన్‌లను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల, ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్, ఎమ్మెల్సీ దండే విటల్‌లతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం సమావేశం మందిరంలో అధికారులతో జిల్లా అభివద్ధిపై మంత్రి సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ అభివద్ధి, సంక్షేమ పథకాలను అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో అమలు చేస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం జిల్లాలో 1లక్ష 93 వేల దరఖాస్తులు వచ్చాయని, సమర్థవంతంగా సర్వే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 57 సంక్షేమ వసతి గృహాలలో బాలశక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని 30వేల విద్యార్థులకు పౌష్టికారం, వైద్య చికిత్సలతో పాటు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పావలా వడ్డీకే కోటి మంది మహిళలకు రుణాలను అందిస్తామని అన్నారు. మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేలా 17 రకాల వ్యాపారాలను గుర్తించామని అన్నారు. అభివృద్ధిలో మహిళలు భాగస్వాములు కావాలని కోరారు. బ్యాంకు రుణాలు తీసుకోవడం, తిరిగి చెల్లించడంలో జాతీయ స్థాయిలో అవార్డులు తీసుకున్నటువంటి జిల్లా మహిళలకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. మహిళల కోసం ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ.500 కే గ్యాస్ సిలిండర్లను అందిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10లక్షలకు పెంచడం జరిగిందన్నారు. యువతకు ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని, రైతులకు 2 లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని అన్నారు. అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. అనంతరం ఇందిరా క్రాంతి పథకం మహిళా సంఘాలకు రూ.400 కోట్ల బ్యాంకి లింకేజీ చెక్కును, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అమ్మ రక్షిత కార్యక్రమ పోస్టర్లను మంత్రి అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమాలలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డిఓ రత్న కళ్యాణి, మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్, అధికారులు మహిళాలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నేటి నుంచి చెకుముకి సంబరాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను ఈనెల 14, 15, 16 తేదీలలో జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన్ వేదిక రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాజేశ్వర్, రాజా తెలిపారు. శుక్రవారం పట్టణంలోని టీటీడీసీలో మీడియా సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో మొట్టమొదటిసారిగా ఈ చెకుముకి సంబరాలను నిర్వహిస్తున్నామన్నారు. దీనికి 33 జిల్లాల నుండి 132 టీములు అనగా 396 మంది విద్యార్థులు, 132 గైడ్ టీచర్లు హాజరవుతున్నారన్నారు. ప్రఖ్యాత శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, మేధావులు, అధికారులు జిల్లాకు వస్తున్నట్లు వెల్లడించారు. మూడు రోజులు జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థులకు రాత పరీక్ష, ఆక్టివిటి రౌండ్, క్విజ్, విజువల్ రౌండ్, క్రియేటివ్ రౌండ్, సైన్స్ ప్రయోగాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. అలాగే, సైన్స్ సెమినార్లు, శాస్త్రవేత్తలతో ముఖాముకి, ఆకాశ దర్శనం, సైన్స్ ఎగ్జిబిషన్, మిరాకిల్ ఎక్స్పోజర్, సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్ మ్యాజిక్, సైన్స్ గేములు, చరిత్ర గతిని మార్చిన శాస్త్రవేత్తల ఎగ్జిబిషన్, ఫీల్డ్ ట్రిప్, పుస్తక ప్రదర్శన, సైన్స్ కార్నివాల్ (స్ట్రీట్ సైన్స్ షో), ఇస్రో ఎగ్జిబిషన్లు అదనపు ఆకర్షణలుగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబురాలు విజయవంతం చేయడానికి రాష్ట్రంలోని వివిధ సంస్థలు, సైన్స్ అభిమానులు, మేధావులు, నాయకులు, విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు, ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు లక్ష్మారెడ్డి, రామచంద్రయ్య, రవిందర్ రెడ్డి, జిల్లా విద్యాధికారి ప్రణీత, జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శి ఉమాకాంత్, పెంటపర్తి ఊశన్న, విరన్న పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మహాసభలు విజయవంతం చేయండి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) జిల్లా ఆరవ మహాసభలను ఈనెల 15న నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ తెలిపారు. మహాసభలకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివారం పట్టణంలోని న్యూఅంబెడ్కర్ భవనంలో ఈ మహాసభలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు, అనీల్ జాదవ్, విశిష్ఠ అతిథిగా కలెక్టర్ రాజర్షిషా, గౌరవ అతిథులుగా డీయూఓ టి.ప్రణీత, రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర ఏఫ్ డబ్ల్యూఎఫ్ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వెంకట్ తదితరులు హాజరవుతునున్నట్లు పేర్కొన్నారు. ఈ మహాసభలో ఉపాధ్యాయ సమస్యలపై చర్చించి పలు తీర్మాణాలు చేయనున్నట్లు తెలిపారు. కావున ఈ మహాసభలకు ఉపాధ్యాయులు అందరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎం.స్వామి, ప్రధాన కార్యదర్శి వి.అశోక్, ఉపాధ్యక్షులు టి.సూర్యకుమార్, జిల్లా కార్యదర్శులు సి.విలాస్, గౌస్ మొహియుద్దీన్, సోషల్ మీడియా కన్వీనర్ కె.శంకర్ వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.



మహాసభల పోస్టర్ల విడుదల

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

టీఎస్ యూటీఎఫ్ జిల్లా 6వ మహాసభల పోస్టర్లను మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల హెచ్‌ఎం భూమన్న శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ మండల అధ్యక్షుడు మల్లయ్య మాట్లాడుతూ ఈ నెల 15న జిల్లా కేంద్రములో న్యూ అంబేద్కర్ భవనంలో టీఎస్ యూటిఎఫ్ జిల్లా 6వ మహాసభలు నిర్వహిస్తున్నారు. ఈ సభకు మండల బాధ్యులు, ఉపాధ్యాయులు, సభ్యులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమ్మెకు మద్దతు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమ్మెకు తాము మద్దతునిస్తున్నట్లు పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏటుకూరి శ్రీనివాస్‌రావు, సునార్కర్ అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరు అతి తక్కువ వేతనాలతో గత 15 ఏళ్ల నుండి పని చేస్తున్నారని, గత ప్రభుత్వం వీరిని రెగ్యులర్ చేయకుండానే మోసం చేసిందని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఎన్నికలకు ముందు వీరిని రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటి వరకు నిలబెట్టుకోలేదని అన్నారు. వారి హక్కులు, మెరుగైన జీవితాలు, జీతాలు, రెగ్యులర్ కోసం చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా శనివారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముందు వారు చేస్తున్న సమ్మె శిబిరానికి వెళ్లి సంఘీభావం తెలుపనున్నట్లు పేర్కొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ సంఘీభావం..

ఆసిఫాబాద్‌లో కలెక్టరేట్ ముందు సమ్మె చేపడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగ, ఉపాధ్యాయుల శిబిరానికి వెళ్లి సంఘీభావం తెలిపినట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు శాంతికుమార్ తెలిపారు. గత 15 ఏళ్ల నుండి వీరు సమగ్ర శిక్షలో పని చేస్తున్నారని, వీరికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, వెంటనే అన్ని అర్హతలు కలిగిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ మండల అధ్యక్షుడు జంగంపల్లి లక్ష్మయ్య, జిల్లా సభ్యులు రాథోడ్ ప్రకాష్ పాల్గొన్నారు.

గ్రూప్-2కు పకడ్బందీ బందోబస్తు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 15, 16 తేదీల్లో జిల్లాలో నిర్వహించే గ్రూప్-2 పరీక్షలకు పకడ్బందీగా బందోబస్తు నిర్వహించాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేసిఅన్ని పోలీస్ స్టేషన్‌ల సిబ్బందితో బందోబస్తుకు సంబంధించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద 163 సెక్షన్ విధించామన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించవద్దన్నారు. ప్రతి సెంటర్ ఆవరణలో సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. పరీక్ష కేంద్రాల చుట్టూ 360 డిగ్రీస్‌లో బందోబస్తు, 4 ఎస్కార్ట్, 4 రూట్ మొబైల్ పార్టీలను ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావు, డీఎస్పీలు కరుణాకర్, రామానుజం, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ఎన్నికలకు ఏర్పాట్లు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణ పద్మశాలి సంఘం ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్ల కనకయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గడదాసు మల్లయ్య తెలిపారు. ఈ మేరకు ఎన్నికల అధికారులను నియమిస్తున్నట్లు వారు తెలిపారు. శుక్రవారం స్థానిక పద్మశాలి సంఘం భవనంలో ఎన్నికల అధికారులకు ఎన్నికల నిర్వహణ పత్రాన్ని అందించారు. ముఖ్య ఎన్నికల అధికారిగా వాసాల ప్రభాకర్, ఎన్నికల అధికారులుగా కటకం మధూకర్, మామిడాల తిరుపతయ్య, అనుమాండ్ల రవీందర్, గడదాసు గోపి, అనుమాండ్ల సుధాకర్, బోగ మధూకర్, ముఖ్య న్యాయ సలహాదారుగా పరికిపండ్ల సతీష్‌లను నియమించారు. తదనంతరం నిర్వహించే సమావేశంలో ఎన్నికల నిర్వహణ తేదీలను ప్రకటించాలని వారు ఎన్నికల అధికారులకు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎదురెదురుగా వస్తున్న బైకులు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని సాలెగూడ వద్ద ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...జనకాపూర్‌కు చెందిన మహేష్ తన అక్క కూతురు విపాసన(8)తో కలిసి ఇప్పల్ నవేగాంలోని తన చేనుకు వెళ్లి వస్తుండగా సాలెగూడకు చెందిన విజయ్ ఆసిఫాబాద్ నుండి సాలెగూడ వెళ్తున్న క్రమంలో ఎదురెదురుగా ఢీకొట్టాయి. ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మంచిర్యాల తరలించే క్రమంలో విపాసన మరణించగా, ఇరువురు మంచిర్యాలలో చికిత్స పొందుతున్నారు.

18 నుండి డీఎడ్ పరీక్షలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 18వ తేదీ నుండి డీఈడీ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి యాదయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 18 నుండి 24వ తారీఖు వరకు పరీక్షలు ఉంటాయని, ఉదయం 9 నుండి 12 గంటల వరకు పరీక్ష కాలం ఉంటుందని, నేటి నుండి హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.